క్లుప్తంగా

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: పట్టణంలోని బుడగజంగాల కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బుడగజంగాల కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సీబీ.లత, కేఈ రాంబాబు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు అంద్రయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు చింతమానుపల్లెలో వసంతోత్సవం



వసంతప్ప పీఠం

సి.బెళగల్: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో శుక్రవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఏటా పంటల దిగుబడులు ఇళ్లకు చేరిన సందర్భంగా మాఘమాసం దశమిలో వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సమీపంలోని వసంతప్ప ఆలయంలో స్వామివారి పీఠంను సుందరంగా అలంకరించి శుక్రవారం సాయంత్రం ఫలహార బళ్లతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

సర్వేలను పకడ్బందీగా చేపట్టాలి



పోలకల్ సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ సర్వేలను వేగంగా, పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని పోలకల్ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, ఎన్‌పీసీఐ, ఆధార్ నమోదు, నాన్ రెసిడెన్సీ ఆఫ్ ఏపీ, జియో మ్యాపింగ్ తదితర సర్వేల్లో మండలం వెనుకబడి ఉందని, ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసి సకాలంలో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

దూడల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



కాల్షియం బాటిళ్లను అందజేస్తున్న అధికారులు

పాణ్యం: పాడి రైతులు లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ పాణ్యం ఏడీ కమలాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో లేగదూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన కల్పించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా దూడల ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొదటి, రెండు వారాల నుంచి దూడలపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. దూడలకు కావాల్సిన కాల్షియం, నట్టల నివారణ మందులు, మినరల్ బ్రిక్స్, విటమిన్ ఏ ఇంజెక్షన్లను ఇస్తున్నట్లు తెలిపారు. దూడల ప్రదర్శనలో బహుమతులు సాధించిన వారికి క్యాన్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ పార్థసారథి, గిడ్డయ్య, చంద్రమోహన్, చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

మొదటి అదనపు జిల్లా జడ్జిగా భూపాల్‌రెడ్డి



కర్నూలు: కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జిగా జి.భూపాల్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది జూన్ నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇన్‌చార్జ్ జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం రాష్ట్ర హైకోర్టు కర్నూలులో ఖాళీగా ఉన్న మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జిగా, ఏడవ అదనపు జడ్జిగా పనిచేస్తున్న భూపాల్‌రెడ్డిని బదిలీ చేయగా ఉత్తర్వుల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది నుంచి బాధ్యతలు స్వీకరించి కోర్టు విధులకు హాజరయ్యారు. ఇదిలాఉండగా శుక్రవారం ఫ్యామిలీ కోర్టు, మహిళా కోర్టు, పోక్సో కోర్టు జడ్జిలు బాధ్యతలు చేపట్టనున్నారు.

జొన్న.. సిరుల పంట

- రబీలో ఆసక్తి చూపుతున్న రైతులు
- 110 రోజుల్లో పంట చేతికి..
- గడివేముల మండలంలో 7 వేల ఎకరాల్లో సాగు



గడిగరేవుల గ్రామంలో సాగుచేసిన జొన్న పంట

గడివేముల: రబీలో జొన్న సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో మక్కువ చూపుతున్నారు. ఒకే తరహా పంటలు సాగు చేసి నష్టపోవడం కన్నా వివిధ రకాల పంటలు సాగు చేయడం ఉత్తమమని భావిస్తున్నారు. సాగులో మెళకువలు, రైతు సేవా కేంద్రాల నుంచి ఇస్తున్న సహకారంతో జొన్నను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం 34382 ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్‌లో 19 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. ఇందులో 7 వేల ఎకరాల వరకు జొన్న పంటను సాగు చేశారు. ముఖ్యంగా బూజునూరు, మంచాలకట్ట, చిందుకూరు, గడిగరేవుల, కొరటమద్ది, కరిమద్దెల, పెసరవాయి, బిలకలగూడూరు గ్రామాల్లో జొన్న పంట అధికంగా వేశారు. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికి వచ్చే పంటగా రైతులు ఎన్నుకుంటున్నారు.

ఎకరాకు రూ.15 నుంచి 20 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎక్కువ శాతం రైతులు జొన్న పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు రూ.30 నుంచి రూ. 50 వేల ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. అయితే పంటలో పరుగుల బెడద అధికంగా ఉండడంతో మందులు వాడుతున్నారు.

జొన్న పంటపై రైతు ఆసక్తి

మండలంలో జొన్న పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. త్వరగా చేతికి వచ్చే పంటగా జొన్న పంటను ఎన్నుకుంటున్నారు. రబీ సీజన్‌లో పంట సాగుకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రబీ సీజన్‌లో సుమారు 7 వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ఈ–పంట నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం వస్తుంది.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

లాభాలు వస్తున్నాయి



రైతులంతా జొన్న పంట సాగుపైనే దృష్టిసారిస్తున్నారు. నాకున్న 5 ఎకరాల పొలంతో పాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఖరీఫ్‌లో సోయాబీన్ పంట సాగు చేశాను. ఇప్పుడు జొన్నపంట వేశాను. మంచి దిగుబడి వచ్చింది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు జొన్న పంటను వేశాను. ఎకరాకు ఖర్చులు పోను రూ.30 నుంచి 50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

–షేక్ చిన్న షాలుమియ్య, రైతు, బూజునూరు గ్రామం

ప్రతిసారి జొన్ననే సాగుచేస్తాను



రబీలో జొన్న సాగుకు అనుకూలంగా ఉంటుంది. బోర్ల కింద నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశాను. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటగా ఎన్నుకున్నాను. ప్రభుత్వం ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటిస్తే మాలాంటి రైతులు బాగుపడతారు. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది ఇస్తున్న సలహాలు, సూచనలు పాటిస్తున్నాం.

–శివుడు, గడిగరేవుల

13న పొట్టేళ్ల పోటీలు

కోడుమూరు రూరల్: కోడుమూరులో చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని ఈనెల 13న స్థానిక సంతమార్కెట్‌లో పొట్టేళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దీప్తిరాజు గురువారం తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10,000, 2వ బహుమతి రూ.7500, 3వ బహుమతి రూ.5000గా అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరులోని క్రిష్ణాపురం రోడ్డు నర్సరీ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పేకాటరాయుళ్లంతా దేవనకొండ మండలం మాచాపురం, కప్పట్రాళ్ల, పాత బోదెపాడు గ్రామాలకు చెందిన వారని చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.23,500 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్సార్బీసీలో డ్రైవర్ గల్లంతు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం పరిధిలోని ఎస్సార్బీసీ కాల్వలో పడి కంటైనర్ డ్రైవర్ గల్లంతయ్యాడు. గురువారం తమిళనాడు నుంచి హైదరాబాద్ వెళ్తున్న మూడు కంటైనర్ డ్రైవర్లు ఎస్సార్బీసీ కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వాహనాలు ఆపారు. ఆరుమురుగన్ (55) అనే డ్రైవర్ స్నానం చేస్తుండగా మరో ఇద్దరు వాహనాలను పరిశీలించేందుకు వెళ్లారు. వారు తిరిగి వచ్చి చూడగా ఆరుమురుగన్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాల్వ వద్ద గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



చేతిపంపు మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూల్ డివిజనల్ ఇంజినీర్ (డీఈ) శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన చేతి పంపుల మరమ్మతు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ గోనేనాయక్‌తో కలిసి పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని 45 రోజుల పాటు క్రాష్ కార్యక్రమంలో భాగంగా మంచినీటిని అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. నీటి వనరుల మరమ్మతులు, నిర్వహణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేస్తామని తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో చేపట్టిన చేతి పంపు మరమ్మతు పనులను పరిశీలించారు. మండలంలో 138 చేతి పంపులు ఉండగా, 11 చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు.

లో వోల్టేజ్ సమస్యపై వినతి



విద్యుత్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డు పరిధిలోని సవారి తోట కాలనీలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. గురువారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఎలక్ట్రిసిటీ ఏఈ కవితకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కాలనీలో లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇంట్లో ఉన్న బల్బులు పూర్తిస్థాయిలో వెలగడం లేదని, ఫ్యాన్లు, టీవీలు పనిచేయడం లేదన్నారు.

రాత్రి పూట నిద్రలేక కాలనీ వాసులు జాగరణ చేయాల్సి వస్తోందన్నారు. అలాగే వీధిలైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదన్నారు. పరిశీలించి విద్యుత్ పూర్తి స్థాయిలో వచ్చే విధంగా మరో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మౌలాలి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



పులకుర్తిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: వలసల నివారణలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్‌బాషా పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పథకం కింద కావాల్సినంత మంది కూలీలకు పనులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 వరకు పడుతుందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీలకు పనులు కల్పించేందుకు 50 మంది కూలీలలకు కలిపి ఒక మేటీని నియమించడం జరిగిందని, కూలీలంతా ఉపాధి పనుల్లోకి రావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మద్దూరు పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: విద్యార్థులు ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చని డీఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం మద్దూరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్లు, టీవీలు చూస్తూ సమయం వృథా చేసుకోవచ్చని సూచించారు. సమయం ఎంతో విలువైందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం కొణిదేడు పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ కోటయ్య, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ గురువారం నగరంలోని ఆద్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కె.కె.పాలి క్లినిక్‌లలోని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్కానింగ్ కేంద్రంలో రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల వారు రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, అలా చేస్తే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాల్వబుగ్గ ఉత్సవ కమిటీ నియామకం

ఓర్వకల్లు: కాల్వబుగ్గలోని బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులను నియమించినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు 12 మందితో కూడిన కమిటీ సభ్యులను నియమించామన్నారు. ఇందులో కాటినేని నారాయణ, మాసెపోగు వరలక్ష్మి, లొద్దిపల్లె లక్ష్మీదేవి, ఎం. లక్ష్మీదేవి, తెలుగు లక్ష్మీదేవి, కాకి రామచంద్రుడు, ఎం.పెద్ద మల్లయ్య, బి.ప్రభావతమ్మ, బి.రామాంజనేయశర్మ, బజారి పద్మావతి, నంది కమలోత్ మత్రునాయక్, కళ్లె లక్ష్మీనారాయణశర్మ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

స్టెమీ ఇంజెక్షన్‌పై అవగాహన కల్పించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు

ఓర్వకల్లు: స్టెమీ ఇంజెక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వైద్య పరికరాలు, పలు విభాగాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్టెమీ అనేది అతి ఖరీదైన సూదిమందు అని తెలిపారు. ఈ మందు విలువ బయట మార్కెట్‌లో రూ.42 వేల నుంచి రూ. 45 వేలు ఉంటుందని తెలిపారు. దీనిని గుండె పోటు వచ్చిన వారికి వినియోగిస్తారన్నారు. వైద్య సిబ్బంది విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. వైద్యాధికారిణి మంజుల, వైద్యుడు ఆదిత్యకుమార్ ఉన్నారు.

పాఠశాల కంటే వైన్‌షాపే ముఖ్యమా?

పాణ్యం: ప్రభుత్వ పాఠశాల రోడ్డు కంటే వైన్ షాప్‌నకే జాతీయ రహదారి అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎస్ఎస్‌యూఐ నేతలు మండిపడ్డారు. గురువారం ఆ సంఘం నేత బత్తిన ప్రతాప్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి పక్కనున్న సుగాలిమెట్ట గ్రామం వద్ద ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల విద్యాలయకు సరైన రోడ్డు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కనీసం హైవే నిర్మాణంలోని వ్యర్థాలను ఈ రోడ్డులో వేస్తే నడిచి వెళ్లేందుకైనా అనువుగా ఉంటుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అయితే ఎవరూ పట్టించుకోలేదన్నారు. పాణ్యంలోని వైన్‌షాప్‌నకు మాత్రం హైవే అధికారులు మార్గం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాల కంటే వైన్ షాపే ఎక్కువా అని ప్రశ్నించారు.

డిగ్రీ పరీక్షలకు 57 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయిక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. డిగ్రీ పరీక్షలను 11, బీఈడీ పరీక్షలను 8 కేంద్రాల్లో నిర్వహించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. డిగ్రీ పరీక్షలకు 541 మందికిగాను 484 మంది హాజరుకాగా 57 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ పరీక్షలకు 108 మందికి 93 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కాల్వబుగ్గ కోనేర్లలో శుభ్రత పనులు



కోనేరులో నీళ్లను తొలగిస్తున్న సిబ్బంది

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ ఆలయ కోనేర్లలో గురువారం శుభ్రం పనులు చేపట్టారు. మహాశివరాత్రి దగ్గర పడుతుండడంతో ఆలయ ఈఓ మద్దిలేటి పర్యవేక్షణలో స్థానిక చిన్న కోనేరు, పెద్ద కోనేర్లలో అపరిశుభ్రంగా ఉన్న నీటిని తొలగించి, శుభ్రం చేశారు. భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బంది లేకుండా స్త్రీ, పురుషులకు వేర్వేరుగా స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం



వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న

కోడుమూరు రూరల్: నులిపురుగుల నివారణ వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని కోలోకెటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నులిపురుగుల నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాలలోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలతో పిల్లలు బాధపడుతుంటారన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏడాది నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ప్రిన్సిపాల్ గౌసియాబేగం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నవీన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న డీఈఓ

పాణ్యం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని నంద్యాల డీఈఓ జనార్దన్ రెడ్డి అన్నారు. పాణికేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులతో గురువారం పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారం తొలగించి, ముళ్లకంపలను తీసివేశారు. పురాతన ఆలయాలను శుభ్రం చేస్తూ విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈఓ సువర్ణ, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, రాయలసీమ ప్రాంతీయ పర్యావరణ సమన్వయకర్త కుమార్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందరరావు, దీక్ష కో–ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో సమయపాలన పాటించండి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలు సమయపాలన పాటించి, గరిష్ట వేతనం పొందాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని శకునాల, కాల్వ గ్రామాల వద్ద జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇందులో భాగంగా శకునాల చెరువు, కాల్వ గ్రామం చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో సమీక్షించారు. ఉపాధి పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. రోజుకు కనీసం 4 గంటలు పనిచేసి, గరిష్ట వేతనం రూ.300 పొందాలని తెలిపారు. ఎండను దృష్టిలో పెట్టుకొని ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని పేర్కొన్నారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. మార్చి నెల నుంచి పని ప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులతో పాటు, నీడ కోసం పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

సి.బెళగల్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ నాయకురాలు ఉషా ఆధ్వర్యంలో మండల సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు దేశంలో సంపదను దోచిపెట్టడానికి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నూతన లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని కోరారు. కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్మిక సంఘం నాయకులు జమాల్‌బీ, రంగమ్మ, జ్యోతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.